క్లుప్తంగా

కొనసాగుతున్న ప్రతిష్ఠోత్సవాలు



విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

తుగ్గలి : మండలంలోని బోడబండలో రామ లింగేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం బ్రహ్మశ్రీ శ్రీ రామనాథశాస్త్రి ఆధ్వర్యంలో పురోహితులు ప్రాతఃకాలపూజ, దీక్షాహోమం, యంత్ర స్థాపన, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం విగ్రహాలను ఊరేగించారు. సోమవారం వేకువజామున విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త సుదర్శన్‌రెడ్డి, ఆలయ నిర్వాహకులు కృష్ణయ్యాచారి తెలిపారు.

రేపు చేపల పెంపకానికి వేలం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణ సమీపంలోని అటవీశాఖ పరిధిలోని వీరగన్నగట్టు చెరువులో చేపల పెంపకానికి ఈ నెల 19వ తేదీన వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఫారెస్టు రెంజ్ అధికారి జి. విజయకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో నిర్వహించిన వేలానికి సరిగా స్పందన లభించకపోవడంతో వాయిదా వేసి మరోసారి నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. 2024 జూలై 1 నుంచి 2025 జూన్ 30వ తేదీ వరకు ఏడాది కాలానికి హక్కులు వర్తిస్తాయని వివరించారు. ఆసక్తి గల వారు కర్నూలు రేంజ్ కార్యాలయంలో 19న ఉదయం 11 గంటలకు జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ఆలూరు: స్థానిక జ్యోతిబసు భవన్‌లో సోమవారం వేదావతినదిపై ప్రాజెక్టు నిర్మాణ పనులపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని సీపీఎం నాయకులు ఆదివారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన సీపీఎం, సీఐటీయూ, రైతు సంఘం నాయకులతో పార్టీ మండల కార్యదర్శి షాకీర్ సమావేశమయ్యారు. సమావేశానికి అన్ని రాజకీయ పార్టీ నాయకులు హాజరు కావాలని సీపీఎం జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణస్వామి కోరారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

మద్దికెర : మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ విజయ్ కుమార్ నాయక్ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం గుంతకల్లు రహదారిలో వాహనాల తనిఖీ చేపట్టారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురైతే కుటుంబం తీవ్రంగా నష్టపోతుందన్నారు. మీ కోసం భార్య, పిల్లలు ఎదురుచూస్తూ ఉంటారనేది మననంలో పెట్టుకొని జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కేసులు



ఆలూరు అంబేడ్కర్ సర్కిల్‌లో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ నరసింహులు

ఆలూరు రూరల్: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని ఆలూరు ఎస్‌ఐ నరసింహులు హెచ్చరించారు. ఆదివారం రాత్రి స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో వాహనాల తనిఖీతో పాటు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని సూచించారు. బైక్‌పై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. అనంతరం వాహన తనిఖీలు చేసి రికార్డులు పరిశీలించారు.

అలరించిన నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఆదివారం సీక్యాంప్ కళాక్షేత్రంలో ప్రదర్శించిన 'ఇది రహదారి కాదు' సాంఘిక నాటక ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. ' సమాజంలో స్వేచ్ఛ ఉంది కానీ అనేక సాంస్కృతిక దాడులు ఈ దేశాన్ని చుట్టు ముట్టాయి. పెళ్లి కాకుండానే కలిసి ఉండటం అనే దిక్కుమాలిన సంస్కృతి ఇప్పుడు మన దేశంలో అడుగుపెట్టింది. ఇద్దరు సంపాదిస్తారట, కలిసి ఉంటారంట పిల్లల్ని కనరంట ఇది దేశానికి వినాశకరం' అనే సందేశాన్ని ఇస్తూ హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించిన నాటకం ఆకట్టుకుంది. ఆకురాతి భాస్కర్ చంద్ర రచించిన నాటకానికి ఎస్.ఎం.బాషా దర్శకత్వం వహించారు. పత్తి ఓబులయ్య, నక్కలమిట్ట శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ రంగనాయకులు పాల్గొన్నారు.

ఆదుకోని 'ఉపాధి'

- పనికి తగ్గ వేతనం లేక.. సక్రమంగా అందని కూలి
- పనులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం
- అతివృష్టితో పంటలు చేతికందక వలస బాటలో సన్నకారు రైతులు,కూలీలు
- రోజుకు 1800–2200 మంది పనులకు రావాల్సి ఉన్నా.. సగం మంది కూడా రాని వైనం
- ఈ ఏడాదికి 3లక్షల పనిదినాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం
- ఇప్పటి వరకు 60వేల పనిదినాలు మాత్రమే పూర్తి
- నియోజకవర్గంలో 67,845 జాబ్ కార్డులు, 1,00,803 మంది కూలీలు





ఆలూరు సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు, సొంతూరులో పనులు లేక వలస వెళ్తున్న ఆస్పరి మండలం హలిగేర గ్రామస్తులు (ఫైల్)

ఆలూరు రూరల్: జాతీయ ఉపాధి హామీ పథకం.. కూలీలకు వరంగా మారాల్సి ఉండగా.. నిరుపయోగంగా మారింది. యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా సరైన సమయంలో పనులు చూపకపోవడం, చేసిన పనులకు సక్రమంగా వేతనాలు అందజేయకపోవడంతో కూలీలకు కడుపు నింపడం లేదు. దీంతో ఈ ప్రాంత వాసులు పొట్ట చేత పట్టుకొని సుదూర ప్రాంతాలకు పనుల కోసం వలస వెళ్తున్నారు. చేసిన పనులకు ఆయా ప్రాంతాల్లో వెంటనే కూలీలు ఇస్తుండటం, ఇక్కడ కన్నా కాస్త ఎక్కువ పనిచేస్తే.. మూడింతలు అధికంగా కూలి వస్తుండటంతో చిన్న, సన్నకారు రైతులతో పాటు కూలీలు వలస వెళ్లడానికి కారణభూతమవుతున్నాయి. వీటికి తోడు వర్షాధార వ్యవసాయం కావడంతో ప్రకృతి సహకరించక అతి,అనావృష్టి వారికి శాపంగా మారి.. ఏటా నష్టాలే మిగులుతుండటంతో రైతు కంటీ కూలీగా నయమనే స్థితికొచ్చారు.

ముంచిన వరుణుడు..

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో అనావృష్టి, చివర్లో అతివృష్టితో పంటలు దిగుబడి అంతంత మాత్రంగా వచ్చింది. ఉపాధి పనికి వెళ్దామంటే పనులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. చేసిన పనికి తగ్గ వేతనం రాక.. కూలి గిట్టుబాటు కావడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలి అందాలంటే మూడు నుంచి నాలుగు నెలలు వేచి ఉండాల్సిన పరిస్థితి. దీంతో పిల్లాపాపలతో పట్నాలకు వలస వెళ్తున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 55,108 కుటుంబాలు ఉపాధి పథకం కింద పనిచేస్తున్నారు. మొత్తం 67,845 జాబ్ కార్డులు ఉండగా.. 1,00,803 మంది కూలీలు ఉన్నారు. గత నాలుగు వారాల కూలి చెల్లించాల్సి ఉందని ఉపాధి హామీ పథకం అధికారులు వెల్లడించారు.

నష్టాన్ని మిగిల్చిన ఖరీఫ్.. అంతంత మాత్రంగా రబీ..

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాలు రాక పంటలు సాగు చేసేందుకు రైతులు ఇబ్బంది పడ్డారు. నియోజకర్గంలో 83 వేల హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణం కాగా.. ఖరీఫ్‌లో 56 వేల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఆగస్టు చివర్లో కురిసిన అధిక వర్షాలకు పంటలు పూర్తి స్థాయిలో కోల్పోయి దిగుబడి రాలేదు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 1,400 హెక్టార్లలో పంటలు నష్టపోయారు. రబీ సీజన్‌లో ప్రారంభమై నెల కావస్తున్నా.. ఇంకా పూర్తి స్థాయిలో పంటలు సాగు కాలేదు. ఇప్పటి వరకు 48 వేల హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి.

మండలాల వారీగా జాబ్ కార్డులు, కూలీలు, పనికి వెళ్తున్న వారి వివరాలు..

మండలం	జాబ్ కార్డులు	కూలీల సంఖ్య	పనికి వెళ్తున్న కూలీలు
ఆలూరు	10,786	15,444	904
ఆస్పరి	13,953	21,552	1,560
చిప్పగిరి	7,203	10,971	1,11
హాలహర్వి	10,180	15,788	1,220
హొళగుంద	10,715	15,974	970
దేవనకొండ	15,368	21,074	1,650

సొంతూరులో పనులు లేక..

సొంతూరులో పనులు లేక రైతులు, వ్యవసాయ కూలీలు వలస వెళ్తున్నారు. ఉపాధి పనికి వెళ్తే రోజు రూ.290 వరకు ఇస్తున్నారు. అది కూడా రెండు నుంచి మూడు వారాలు వేచి ఉండాలి. ఇచ్చే కూలి గిట్టుబాటు కావడం లేదు. అదే గుంటూరు, తెలంగాణా ప్రాంతాల్లో కిలో పత్తి తీస్తే రూ.14 చొప్పున ఇస్తున్నారు. ఒకరు రోజుకు 100 కేజీల పత్తి తీసి రూ.1,400 వరకు సంపాదిస్తున్నారు. నియోజకవర్గంలోని ఆలూరు,ఆస్పరి, హొళగుంద, హాలహర్వి మండలాల నుంచి ఈ ఏడాది వలసలు పెరిగాయి. ఆయా గ్రామాల్లో 50 నుంచి 70 కుటుంబాలు బతుకుదెరువు కోసం వలస వెళ్లారు.

పనులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం..

ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం జాబ్ కార్డు ఉన్నవారికి ఏడాదికి వంద పనిదినాలు కల్పించాలి. మార్చి నెలాఖరుకి ఈ పనిదినాలు పూర్తి కావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు 50 పని దినాలు మాత్రమే కల్పించినట్లు కూలీలు చెబుతున్నారు. 1,00,803 మంది కూలీలు ఉండగా ఇందులో 45 వేల మంది పనికి వెళ్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం రోజుకు రూ.300 వేతనం రావాల్సి ఉండగా.. రూ.250కి మించి రావడం లేదని కూలీలు చెబుతున్నారు. రోజుకు ప్రతి మండలానికి 1800 మంది 2,200 మంది కూలీలు పనులకు రావాల్సి ఉండగా సగం మంది కూడా రావడం లేదు. ఇక ఈ ఏడాదికి 3లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 60వేల పనిదినాలు పూర్తిచేశారు. ఇక మిగిలిన నాలుగు నెలల్లో దాదాపు 2.40లక్షల పనిదినాలు కల్పించడం సాధ్యమేనా అని ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

వేతనం గిట్టుబాటు కావడం లేదు



పేరుకే ఉపాధి. కూలీ గిట్టుబాటు కావడం లేదు. ఇంకుడు గుంతలు, కంప తొలిగించడం వంటి పనులు చేస్తున్నాం. రోజంతా ఈ పనుల మీద ఆధారపడితే లాభం లేదు. రోజుకు కనీసం రూ.250 రావడం లేదు. నాలుగు వారాల వేతనం రావాల్సి ఉంది. వ్యవసాయ పనులు కూడా లేవు. అందుకే చాలా మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు.

– నాగమ్మ, నిట్రవట్టి,హాలహర్వి మండలం

జాబ్ కార్డు కలిగిన వారందరికీ పని



జాబ్ కార్డు కలిగిన వారందరికీ పనులు కల్పిస్తాం. పనిచేసిన కూలీకి రోజుకు రూ.300 చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వారు చేసే పనిని బట్టి వేతనం లభిస్తుంది. ప్రస్తుతం వ్యవసాయ పనులు ఉన్నందున కూలీలు ఎక్కువగా రావడం లేదు. పని కోరిన వారికి ఉపాధి పనులు కల్పిస్తాం. ఈ నెల 11వ తేదీన పెండింగ్ వేతనాలు అందాయి. మరో మూడు వారాల కూలి అందాల్సి ఉంది.

– పద్మావతి,ఏపీడీ,ఆలూరు.

గౌరీదేవికి ప్రత్యేక పూజలు



నిట్రవట్టిలో మట్టితో తయారు చేసిన గౌరమ్మకు పూజలు చేసిన అనంతరం టపాసులు కాలుస్తున్న దృశ్యం



హొళగుందలో కొంతెమ్మ వేడుకలను జరుపుకుంటున్న మహిళలు

హాలహర్వి: మండలకేంద్రంతో పాటు నిట్రవట్టి, బిలేహాల్, విరుపాపురం, మల్లికార్జునపల్లి, అర్ధగేరి తదితర గ్రామాల్లో ఆదివారం గౌరీదేవి (గౌరమ్మ)కు ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మట్టితో గౌరమ్మ విగ్రహాలను తయారు చేసి ఇంటి మిద్దెలపై ఉంచి చక్కెర హారతులిచ్చి పూజలు చేశారు. కుటుంబ సభ్యులు, బంధువులంతా ఇంటి మిద్దెలపై అమ్మవారికి పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

మిద్దెపై మెరిసిన కొంతెమ్మ (బొబ్బెమ్మ)

హొళగుంద: కర్ణాటక సంప్రదాయలను పాటించే ఈ ప్రాంతంలో పెద్ద గౌరమ్మ వేడుకకు ఎంత ప్రాధాన్యత ఇస్తారు. గౌరీ నోములు నోచిన మరుసటి రోజు జరిగే వేడుకకు అంతే ప్రాధాన్యత ఇస్తారు. అందులో భాగంగా మండలంలో ఆదివారం కొంతెమ్మ (బొబ్బెమ్మ) వేడుకలు ఘనంగా జరిగాయి. ఏటా గౌరమ్మ పండుగ మరుసటి రోజు రాత్రి ఇళ్ల పై జరిగే కార్యక్రమాన్ని ఇక్కడి ప్రజలు సంబరంగా జరుపుకుంటారు. కుటుంబ సభ్యులు, బంధువులంతా ఇంటి మిద్దెలపై ప్రత్యేకంగా అలంకరించిన కొంతెమ్మలను కొలువీదీర్చి పూజలు చేశారు. చిన్నారులు చక్కెర హారతిలిచ్చారు. పూజల్లో భాగంగా అమ్మవారికి నైవేద్యం సమర్పించి సామూహిక భోజనాలు చేశారు. అనంతరం బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

హాలహర్వి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2001–2002 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. పాఠశాలలో నాటి గురువులను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థి దశలోని మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. 23 సంవత్సరాల తర్వాత పాఠశాలలో కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, కుశల ప్రశ్నలు వేస్తూ.. సంతోషంగా గడిపారు. అనంతరం నాడు హిందీ మాస్టర్ హనుమంతరెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు రామాంజనేయులు బోధన, క్రమశిక్షణను గుర్తు చేసుకున్నారు. చదువుకున్న పాఠశాలకు తమవంతు సహాయ సహకాలు అందిస్తామని తీర్మానించారు.

14న తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని ధర్మపేటలో వచ్చే నెల 14, 15 తేదీల్లో అండర్–14 విభాగంలో సబ్ జూనియర్ క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించనున్నట్లు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్వగృహంలో పోటీల లోగోను ఆవిష్కరించారు. టీజీ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీలకు సహకారం అందిస్తామని చెప్పారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మూలమూర్తులు

హొళగుంద: దేవరగట్టులో కార్తీక మాసం మూడవ వారంలో భాగంగా ఆదివారం మాళ మల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవ, అభిషేకాలు, కుంకుమార్చన, భండారార్చన, పుష్పార్చన, మహా మంగళహారతి, ఆకుపూజ, నివేదన, నిరాజనం తదితర పూజలు చేపటి నైవేద్యం సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

కేసీ తిమ్మారెడ్డి సేవలు మరువలేనివి



తిమ్మారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

హొళగుంద: ఇంగళదహాల్ గ్రామ అభివృద్ధికి చేసిన శ్రీశైలం, దేవరగట్టు ఆలయాల కమిటీ మాజీ చైర్మన్ కే.సీ.తిమ్మారెడ్డి సేవలు మరవరానివని వక్తలు అన్నారు. ఆదివారం తిమ్మారెడ్డి 107వ జయంతి సందర్భంగా ఎంపీటీసీ మల్లికార్జున, కేసీ తిమ్మారెడ్డి యూత్ సభ్యులు బోడి, పాండు, చంద్రశేఖర్, రాజు, దస్తగిరి, ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షుడు మల్లికార్జున ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. గ్రామంలో విద్య, వైద్య, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, పోస్టాఫీస్, హాస్టల్ సదుపాయాలు ఏర్పాటు చేయడంలో ఎంతో కృషి చేశారని కొనియాడారు.

రేపు ఉరుకుందలో రుద్రహోమం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో ఈనెల 19 మంగళవారం రుద్రహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. హోమంలో పాల్గొనదలచిన వారు ముందుగానే రూ.1500వందలు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఆసక్తి కల్గిన భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీసీ కోరారు.

ప్రభుత్వ అరాచకాలను ప్రజలకు తెలియజేద్దాం



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరూపాక్షి

హాలహర్వి: కూటమి ప్రభుత్వం, నాయకుల అక్రమాలు, అరాచకాలను ప్రజలకు తెలియజేద్దామని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయిస్తోందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన ఉంటుందన్నారు. ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కేసులకు ఎవరూ భయపడవొద్దని, మీకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు వివిధ మార్గాలను ఎంచుకుంటోందని, అందులో ఇదొకటన్నారు. అనంతరం పార్టీ కార్యకర్త అంజి కుమార్తె అనిత వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. పార్టీ మండలాధ్యక్షుడు గంగాధర, ఆలూరు కో–కన్వీనర్ వీరేష్, నాయకులు గోపాల్, ఆలూరు భాస్కర్, మాచనూరు సుంకన్న, గోపాల్‌శెట్టి, గూళ్యం లింగప్ప, రామయ్య, వన్నూరప్ప, అన్నమయ్య పాల్గొన్నారు.

సమాజంలో కవుల పాత్ర కీలకం



గ్రంథాలయంలో విద్యార్థులకు కవుల గురించి వివరిస్తున్న దృశ్యం



కవి అన్నె శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): మనుషుల్లో దేశభక్తిని, మానవత్వాన్ని పెంచడంలో కవుల పాత్ర మహోన్నతమైనదని కవి, రచయిత దివాన్‌వలి అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో జరిగిన వారోత్సవాల్లో ఆయన పాల్గొని విద్యార్థులకు కవుల ప్రాముఖ్యత గురించి వివరించారు. బీసీ హాస్టల్ విద్యార్థులు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సాయిప్రసాద్, గ్రంథాలయ అధికారి కవితబాయి, మరియమ్మ పాల్గొన్నారు.

ఆలూరు: మారుతున్న కాలంలో కూడా పుస్తక పఠనానికి ఆదరణ తగ్గలేదని కవి అన్నె శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆలూరు, మొలగవెల్లి గ్రంథాలయాల్లో ఆదివారం లైబ్రేరియన్ విజయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో చిన్నారులకు వ్యాసరచన పోటీలు, పౌరాణిక వేషధారణ నిర్వహించారు. ఆయనతో పాటు కవి ఈశ్వరప్పను సన్మానించారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం నాయుడు, రిటైర్డు హెచ్ఎం బసవరాజ్, ఉపాధ్యాయులు ఈరన్న, వీరస్వామి, రామమూర్తినాయుడు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం ఆరోగ్యకరం



రాంపల్లిలో ఘన జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న లింగప్ప

తుగ్గలి : అన్ని రకాల సేద్యాల కన్నా ప్రకృతి సేద్యం ఆరోగ్యకరం, సురక్షితమైందని ప్రకృతి వ్యవసాయ మండల కోఆర్డినేటర్ లింగప్ప అన్నారు. ఆదివారం రాంపల్లిలో మహిళా సంఘాల సభ్యులకు ఘన జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. వంద కేజీల దేశీ ఆవుపేడ, రెండు కేజీల బెల్లం, రెండు కేజీ పప్పుధాన్యాల పిండి, గుప్పెడు పుట్టమట్టి, గో మూత్రంతో కలిపి పిడకలుగా తయారు చేసుకోవాలన్నారు. ఈ పిడకలను ఎకరా పొలంలో తొలి దుక్కిలో వేసుకోవడం వల్ల పంటలు స్థిరంగా పెరిగి నాణ్యమైన దిగుబడులు వస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు ప్రతి ఒక్కరూ మొగ్గు చూపాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ రవి, రాముడు, భాస్కర్, బాలరంగడు, పొదుపు సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

సంకల్పించారు.. ఆలయం నిర్మించారు

- అమకతాడులో రూ. కోటిన్నరతో ఆంజనేయస్వామి గుడి పునర్నిర్మాణం
- నేటి నుంచి ప్రతిష్ఠోత్సవాలు



అమకతాడులో నూతనంగా నిర్మించిన ఆంజయనేయస్వామి ఆలయం

కృష్ణగిరి: వందేళ్ల చరిత్ర కలిగిన ఆలయం..అంజన్న చల్లని చూపుతో ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉన్న ఊరు..దీనంతటికీ శ్రీరామ బంటు ఆంజనేయ స్వామి దీవెనలేనని గ్రామస్తుల నమ్మకం. శతాబ్దం క్రితం నిర్మించిన ఆలయం పాతబడుతుండటంతో పునర్నిర్మాణానికి పూనుకున్నారు. ఆధునిక హంగులతో నిర్మాణం పూర్తి చేసి ప్రతిష్ఠోత్సవాలకు సిద్ధమయ్యారు. కృష్ణగిరి మండలంలోని అమకతాడు గ్రామంలో నిర్మించిన అంజనేయస్వామి దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఘనంగా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

విరాళాలతో..

గ్రామంలో ఇప్పటికే పలు దేవాలయాలను పునర్నిర్మాణం చేపట్టారు. అంజన్న దేవాలయం కూడా పూర్తి చేయాలని పూనుకున్నారు. వెంటనే గ్రామంలో ఉన్న వారితోపాటు గ్రామం బయట ఉన్న ఉద్యోగులు, విశాంత్ర ఉద్యోగులు తోచినంత విరాళాలు అందజేశారు. దీనికితోడు వారి మిత్రులు, బంధువులతోపాటు ఇతర గ్రామాలకు వెళ్లి చందాలు వసూలు చేసి నిర్మాణం పూర్తి చేశారు.

రూ.కోటిన్నరతో నిర్మాణం

గ్రామంలోని కొందరు వ్యక్తులు ఓ కమిటీగా ఏర్పడి చందాలను వసూలు చేయడంతో పాటు దగ్గరుండి పనులు చేయించారు. మొదట రూ.80 లక్షల వ్యయంతో చేపట్టాలని తలపెట్టినా పూర్తయ్యే సరికి రూ.కోటిన్నరకు చేరుకుంది. ఆలయ నిర్మాణానికి చిత్తూరు జిల్లా మదనపల్లె నుంచి రాయి తీసుకొచ్చి ఇక్కడే ఆళ్లగడ్డ నియోజకవర్గానికి చెందిన శిల్పులతో చెక్కించి ఆలయాన్ని నిర్మించారు. దేవాలయం ముందున్న సత్యనారాయణ స్వామి కట్టను కూడా పునర్నిర్మాణం చేయించారు.

మూడు రోజుల పాటు ప్రతిష్ఠోత్సవాలు..

ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణం పూర్తి కావడంతో ప్రారంభ ఉత్సవాల్లో మరిన్ని దేవతా మూర్తులు, ధ్వజస్తంభాలు, కట్టడాలను ప్రతిష్ఠించాలని నిర్ణయించారు. ఆలయ ప్రారంభంతో పాటు విమాన గోపుర కుంభాభిషేకం, సుంకులమ్మ, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల వద్ద ధ్వజ స్తంభాలు, సత్యనారాయణ స్వామి కట్ట, వాల్మీకి మహర్షి విగ్రహం, అమకతాడు హైవే స్టేజీ వద్ద శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 18వ తేదీన ప్రారంభమయ్యే ఉత్సవాలు మూడు రోజులు పాటు జరుగుతాయి. 18న వేద పండితులు గణపతిపూజతో ప్రారంభించి గంగపూజ, యాగశాల ప్రవేశం, అఖండ దీపా ప్రజ్వలన కార్యక్రమాలు, 19న వేద పారాయణం, కలశార్చన, ప్రధాన కుంభారాధన, నవగ్రహ హోమం, 20న తెల్లవారుజామున 5 నుంచి 6 గంటలలోపు విగ్రహ ప్రాణప్రతిష్ఠ, ఉదయం పదిన్నర నుంచి శ్రీ ఆజనేయ స్వామి మూల విగ్రహానికి, విమాన గోపుర కుంభాభిషేకం ఉంటుందని నిర్వాహకులు వివరించారు. ఉత్సవాల సందర్భంగా మధ్యాహ్నం అన్నదానం చేయనున్నట్లు చెప్పారు.

దేవాలయ అభివృద్ధికి విరాళం

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలోని శ్రీరంగనాథస్వామి దేవాలయంలో తూర్పు రాజగోపురం నిర్మాణానికి అవసరమైన స్థల కొనుగోలుకు ఆస్పరి గ్రామానికి చెందిన చిన్నపరెడ్డి సరోజమ్మ, రాజగోపాల్‌రెడ్డి రూ.20,116 విరాళం అందజేసినట్లు ఈఓ వీరయ్య ఆదివారం తెలిపారు.